


# రేపటి సూర్యుడు

- కేశిరాజు ఫణిప్రసాద్

అర్జెంటుగా పంపవలసిన ఫైళ్లు. సంతకం పెడుతున్నాను. పగలంతా ఏవేవో మీటింగుల వల్ల స్తిమితంగా సీట్లో కూర్చోటానికి అవకాశం ఉండదు. ఆలస్యంగానైనా ఫైళ్లు తప్పనిసరిగా చూడాలి.

వీటిల్లో ఫెస్టివల్ అడ్వాన్సులు, పెన్షన్ అడ్వాన్సులుఇలా ఎన్నో రకాలు. వీటి తాలూకు ఉద్యోగులు ఎంతో ఆరాటపడుతుంటారు. ఆఫీసరు హోదాలో ఉన్నామని ఆలస్యం చేస్తే, కొంత మంది పైకి బాధపడుతూ మాట్లాడతారు. మరి కొంత మంది టైము చూసుకుని నన్ను కలుసుకుని రిక్వెస్టు చేస్తారు. ఏదీ అవకాశం లేనివాళ్లు. మనసులోనే బాధపడుతుంటారు.

ఎవరైనా, ఏదైనా బాధపడటం సహజం. తలుచుకుంటే మనసు చివుక్కుమంటుంది. వీలైనంత వరకూ తోటివారికి సహాయపడటం నాకు మా నాన్నగారు నేర్పించారు.

సెల్ ఫోన్ మోగింది. ''హలో!'' అని అనబోయాను. అవకాశం లేదు. ''టైము ఎంతైందో తెలుస్తోందా?'' అన్న మాటకు సమాధానంగా వాచ్‌కేసి చూశాను.

''పది గంటలవుతున్నా ఇంట్లోవాళ్లు గుర్తుకు రావటం లేదా?'' అని దబాయిస్తున్న అవతలి వ్యక్తి, నన్ను మాట్లాడనివ్వటం లేదు.

ఎందుకు అని అడగను. అది కూడా కాదు, ఆలోచించటం కూడా నాకు ఎంత మాత్రం ఇష్టం ఉండదు. కారణం అవతల ఉన్న వ్యక్తి నా అర్ధాంగి. పేరు సుమిత్ర. మాకు పెళ్లయి ఎన్నో ఏళ్లయింది. కాలం గడుస్తున్నకొద్దీ, భార్యగా తనకున్న హక్కులు పెంచుకుంటూ. నన్నెంతో గాఢంగా ప్రేమిస్తూ, గారాబంగా చూసుకుంటోంది. ఇలాగే చూసుకుంటూ ఉంటుందన్న నమ్మకం నాకు ఉంది. అందుకే సుమిత్ర మాట వింటూంటాను.

''బయలుదేరుతున్నారా?'' సుమిత్ర మళ్లీ అడిగింది.

''ఒక్క పావుగంటలో ఇంటి కొచ్చేస్తున్నాను.'' ఆఖరు ఫైళ్లు సంతకం పెట్టేసి మూసేశాను.

''తొందరగా ఇంటికి రండి...'' కలిసి భోజనం చెయ్యాలన్న విషయం నాకు అర్థమయ్యేటట్టుగా మాట్లాడి ఫోన్ పెట్టేసింది.

ఆఫీసులో ఉన్నంతసేపూ ఏమీ అనిపించదు. కాని ఇంటి మీద కనుక ధ్యాస మళ్లిందంటే, అప్రయత్నంగానే ఆరాటపడిపోతాం. వెంటనే లేచి, మోటార్ బైక్ మీద ఇంటికి బయలు దేరాను. అలవాటుగా బైక్‌ని మెల్లిగా పోనిస్తున్నాను. విచిత్రమేమిటంటే, నా మనసు నాకంటే ముందు వెళ్లిపోతోంది. రాత్రి కావటంతో రోడ్డు మీద ట్రాఫిక్ లేదు. హుషారుగా నడుపుతున్నాను.

కొంచెం దూరం వెళ్లాను. బండిలో పెట్రోలు రిజర్వ్‌లో పడింది. అటూ ఇటూ ఊగిసలాడి ఇంజిన్ ఆగి పోయింది. అప్పుడు నాకు గుర్తుకొచ్చింది. పొద్దుట వస్తూ వస్తూ దారిలో పెట్రోలు పోయించుకోవాలనుకుని, పెట్రోలు పంపు దగ్గర జనం ఉండటంతో పెట్రోలు పోయించుకోలేదని.

ఇపుడు ఎలాగూ తప్పదు. అందులోనూ ఇపుడు జనం కూడా ఎక్కువగా ఉండరు. బండి స్టార్ట్ చేసి పెట్రోలు పంపు దగ్గరకి పోనిచ్చాను.

''ఏదో రకంగా ఆలస్యం తప్పదు'' కసురుకుంటోంది మనసు.

రాత్రి పది గంటలు దాటాక, ఈ పెట్రోలు బంకు ఖాళీగా ఉంటుంది. ఎప్పుడూ ఇక్కడే పెట్రోలు పోయించుకుంటూ ఉంటాను.

ఇవాళ ఎందుకో చాలా మంది పెట్రోలు కోసం లైనులో నుంచున్నారు. కారణం ఏమిటోననుకుంటూ అక్కడే ఆగిపోయాను. ఒక్కసారి అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాను.

కస్టమర్లు పెట్రోలు పోసే కుర్రాడి మీద ఒకేసారి అరుస్తున్నారు. గోల గోల! ''ఇంత సేపూ మమ్మల్నీ లైనులో నుంచోపెట్టి, ఇప్పుడు నా డ్యూటీ అయిపోయింది అంటూ వెళ్లిపోతానంటే నిన్ను వదులుతామనుకుంటున్నావా?'' ఆ కుర్రాడి చుట్టూ నిలబడి అటూ ఇటూ కదలకుండా అడ్డం పడుతున్నారు.

''సార్, నా డ్యూటీ సాయంత్రమే అయిపోయింది. ఇక్కడ

డ్యూటీలో ఉన్న మరొకడు వచ్చేవరకు పెట్రోలు పొయ్యమని మా ఓనరు చెప్పాడు. ఇక నా వల్ల కాదు సార్! పొద్దుటి నుండి ఏమీ తినలేదు. దయచేసి నన్ను వెళ్లిపోనివ్వండి."

ఆ కుర్రాడిని పరిశీలనగా చూశాను.

ఇరవై ఏళ్ల లోపువాడు. నీరసంతో మొహం పీక్కుపోయింది. మాట్లాడటానికి కూడా శక్తి లేదు.

"ఒరేయ్ మాటలొద్దు, ముందు మాకు పెట్రోలు పోస్తావా లేదా?" ఒకరిద్దరూ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు.

తన చుట్టూ ఉన్న వాళ్ల వైపు ఏడుపు మొహంతో చూస్తున్నాడు. అంతలో ఆ బంకు యజమాని అక్కడికొచ్చాడు. అతన్ని చూడగానే కస్టమర్లు అతని మీద తిరగబడ్డారు. వాళ్లందరినీ సమాధానపరిచాడు. "ఒరేయ్! వీళ్లందరికీ పెట్రోలు పోశాక నువ్వు వెళ్లిపోరా!" అన్న మాట విని కుర్రాడు, ఓనరు కాళ్ల మీద పడి, తనని విడిచిపెట్టమని బతిమాలుతున్నాడు.

> "ఇవన్నీ మాకు మామూలే! అలాగని పని మానేస్తే ఎలా సార్? ఆ వేళ గొడవకి నా ఒక్క కడుపే మాడింది. పనిచెయ్యటం మానేస్తే మా ఇంట్లో వాళ్ల కడుపులన్ని మాడిపోతాయి. అలా మా వాళ్లని చూస్తూ ఉండలేను కదా!" జవాబు నిర్లిప్తంగా ఉంది. ఈ కుర్రాడిక్కడ తప్పనిసరిగా పని చేస్తున్నాడు. అతని మాటలని అర్థం చేస్తున్నాను. తప్పనిసరై పని చెయ్యటం వేరు, తప్పు చేసి పని చెయ్యటం వేరు. అతను మాటలు మరో విధంగా ఆలోచనల్ని ప్రేరేపిస్తున్నాయి. అతని వైపు చూస్తూ ఆలోచిస్తున్నాను.

"ముందు నువ్వు చెప్పిన పని చెయ్యరా!" వాడిని తోసేసి అతను లోపలికి వెళ్లిపోయాడు.

నీరసంతో పడుతూ లేస్తూ ఆ కుర్రాడు మళ్లీ పని మొదలెట్టాడు.

ఒక్కసారి పెట్రోలు పంపులో అటూ ఇటూ చూశాను. అది పెద్ద పెట్రోలు పంపు. మిగతా పంపులు దగ్గర కూడా కుర్రాళ్లు ఉన్నారు. కాని అక్కడ పెట్రోలు కోసం ఒక్కరు కూడా లేరు. వెంటనే ఆ కుర్రాడి దయనీయమైన స్థితి గుర్తుకొచ్చింది.

ఇక ఆగలేక నేను బంకు ఓనరు దగ్గరికి వెళ్లి, "అక్కడ ఖాళీగా ఉన్న కుర్రాళ్లు కూడా పని చేస్తే ఈ కుర్రాడిని ఇంటికి పంపించొచ్చుగా?" అని అడిగాను.

"ఆ విషయం నాకు తెలియదా సార్? అక్కడున్న కుర్రాళ్లు పని లేకుండా లేరు. స్పీడు పెట్రోలు, ప్రీమియం పెట్రోలు, ఎక్స్‌ట్రా ప్రీమియం పెట్రోలు పోసేవాళ్లు" అనగానే, "కరెక్టే కానీ, అక్కడికెవరూ వెళ్లటం లేదుగా! పోనీ, వాళ్లని కూడా నార్మల్ పెట్రోలు పంపు దగ్గరికి పంపించండి." ఎందుకో ఆ కుర్రాడిని ఆదుకోవాలనే తాపత్రయం.

"బలేవారు సార్! ఆర్డనరీ పెట్రోలు ఉన్న పంపు ఒక్కటే. మీకూ తెలుసు కదా సార్! నార్మల్ పెట్రోలు అమ్మటం కోసం ఎన్నిసార్లు అడిగినా సప్లయి రావటం లేదు. అంతే కాదు సార్, ఇక కొన్నాళ్లకు నార్మల్ పెట్రోలు మార్కెట్‌లో దొరకదు. అందరు ఈ కొత్త స్పెషల్ పెట్రోలు పోయించుకుంటారు. ఇంతకీ మీరు పెట్రోలు పోయించుకున్నారా? లేకపోతే వెళ్లండి" అంటూ బయటికి వెళ్లిపోయాడు.

అతను చెప్పిన మాటల్లో నిజం లేదని, చెప్పిన తనకీ, విన్న నాకూ, అంతే కాదు, అందరికీ తెలుసు. వ్యాపారానికీ, వాస్తవానికీ పొత్తు ఎప్పటికీ కుదరదు. ఇక చేసేది ఏమీ లేదు.

ఎందుకో ఆ కుర్రాడి మీద జాలిపడుతోంది నా మనసు. ఎందుకు? ఎందుకని నన్ను నేను ప్రశ్నించుకుంటూనే ఉన్నాను. ఒక్కసారి కాదు. ఇంట్లో ఉన్నా, ఆఫీసులో పని చేస్తున్న ఆ కుర్రాడి జ్ఞాపకం, నన్ను క్షణక్షణం వెంటాడుతూనే ఉంది. నిత్యజీవితంలో ఎంతోమందిని చూస్తాం. మరెన్నో సంఘటనలు కళ్లెదురుగా జరుగుతాయి. ఇలా మనసులో నిలబడిపోవటం అనేది అరుదు.

అలా ఆలోచనలతో ఉండగానే, రోజులు గడిచిపోతున్నాయి. కాలం ముందుకు వెళ్లిపోతున్నా, సంఘటనలూ, జ్ఞాపకాలూ మనతోనే ఉండిపోతాయి. ఇది అనుకోకుండా కలిగిన ఊహ! ఎందుకో మరోసారి ఆ కుర్రాడి పరిస్థితిని అక్కడికి వెళ్లి చూడాలని కూడా నాకు అనిపిస్తోంది.

బాగానే ఉంది. కుర్రాడి పరిస్థితిని చూస్తావు! చూసి ఏంచేస్తావు? అనుమానపడుతోన్న మనసు. అక్కడికి వెళ్లి చూశాక సాటి మనిషిగా సాయం చెయ్యాలని అనిపిస్తోందేమో? నా మనసుని గదమాయించింది, నాలో వివేకం.

అవును. అక్కడికి వెళ్లాలి. ఆ కుర్రాడిని గురించి తెలుసుకోవాలి. నా నిర్ణయం, శనివారం మధ్యాహ్నం ఆఫీసులో పనులన్నీ త్వరగా తెముల్చుకుని, నేను అనుకున్న చోటికి బయలుదేరేలా చేసింది.

పెట్రోలు బంకులోకి వెళ్లగానే, ఆత్రంగా ఆ కుర్రాడెక్కడున్నాడోనని వెతికాను. ఎక్కడా కనిపించలేదు. వెంటనే నాకు నిస్పృహ! ఇవ్వాళ అతనికి డ్యూటీ లేదా? లేకపోతే ఆ రోజు నుండి ఇక్కడ పనిచెయ్యటం మానేసి వెళ్లిపోయాడా? అప్పటికప్పుడు నాలో ఎన్నో సందేహాలు. అతను ఎక్కడున్నాడని లోపల ఆఫీసులో అడిగితే? ఎవరిని అడుగుతాను? అతని పేరు కూడా తెలియదే. ఎలా, ఏం చెయ్యాలి? ఊహించకుండా ఇరకాటం!

కాస్సేపు ఇక్కడే ఉండి ఎదురుచూడాలని నిశ్చయించుకున్నాను. ఒక పక్కగా నా మోటారు బైక్‌ని పార్క్ చేశాను. అటూ ఇటూ చూశాను.

అలా చూస్తూంటే ఏ.ఐ.ఆర్. అనే బోర్డు కనిపించింది. వచ్చిన వాహనాల్లో గాలి నింపుతున్న దృశ్యం కనిపించింది. గాలి నింపుకున్న వాహనం అక్కడి నుంచి వెళ్లి పోయింది. నాకు కావలసిన కుర్రాడు అక్కడ కనిపించాడు.

నాకు తెలియకుండానే మనసు తేలికపడింది. ఇక ఆలస్యం చెయ్యకుండా, నా మోటార్ బైక్ తీసుకుని అక్కడికి వెళ్లాను. బండికి గాలి నింపమని అడిగాను. అతను వెంటనే ఆ పనిలో పడ్డాడు. ఎలా పలకరించాలనుకుంటూంటే చటుక్కున ఒక ఆలోచన. "ఏమయ్యా ఇవ్వాళ నీ డ్యూటీ ఇక్కడా?" పలకరింపుగా అడిగాను.

"అలాగని ఉండదు సార్. పెట్రోలు పోస్తూ మధ్య మధ్య ఈ పని కూడా చేస్తూండాలి" ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

"అన్నట్లు ఒక మాట అడుగుతాను. జవాబు చెపుతావా?" అన్న నన్ను అయోమయంగా చూశాడు అతను. "మీరెవరు సార్? మిమ్మల్ని ఎక్కడా చూడలేదే?" ఆ మాటలు అంటున్నప్పుడు అతని కళ్లలో భయం స్పష్టమవుతోంది.

ఆ రోజు రాత్రి జరిగిన గొడవ అతనికి జ్ఞాపకం చేశాను. "మరి ఆ రోజు అంతగా విలవిలాడిన నువ్వు ఇంకా ఇక్కడే పని చేస్తున్నావెందుకని?" అతన్నే చూశాను.

''ఇవన్నీ మాకు మామూలే! అలాగని పని మానేస్తే ఎలా సార్? ఆ వేళ గొడవకి నా ఒక్క కడుపే మాడింది. పనిచెయ్యటం మానేస్తే మా ఇంట్లో వాళ్ల కడుపులన్నీ మాడిపోతాయి. అలా మా వాళ్లని చూస్తూ ఉండలేను కదా!'' జవాబు నిర్లిప్తంగా ఉంది.

ఈ కుర్రాడిక్కడ తప్పనిసరిగా పని చేస్తున్నాడు. అతని మాటలని అర్థం చేస్తున్నాను. తప్పనిసరై పని చెయ్యటం వేరు, తప్పు చేసి పని చెయ్యటం వేరు. అతను మాటలు మరో విధంగా ఆలోచనల్ని ప్రేరేపిస్తున్నాయి. అతని వైపు చూస్తూ ఆలోచిస్తున్నాను.

చదువు చెప్పించే తల్లిదండ్రులు, తమ పిల్లలను, ఎంత కష్టమైనా చదివించటానికి సిద్ధపడుతుంటారు. పిల్లలు చదివే స్కూలు గురించీ, వాళ్ల చదువుల గురించీ. ఎంతో గొప్పగా చెప్పుకోవాలని ఆరాటపడుతోన్నవాళ్లెందరో! అటువంటిది ఈ వయసులోనే ఈ కుర్రాడు పరిస్థితి ఇలా ఉందంటే, వీడు చదువుకోకుండా చెడిపోయుండాలి. చదువుకోనివాళ్లు కొందరు. చదువుకోవాలని లేనివాళ్లు మరెందరో. వీడికి చదువుకోవాలని లేదు. అంతే! త్వరలోనే వాడెటువంటివాడో ఒక నిర్ణయాని కొచ్చాను.

''సార్, ఎందుకు ఆలోచిస్తున్నారు? మీలాంటి పెద్దవాళ్లు ఇంతగా ఆలోచించే జీవితం కాదు నాది. నాలాంటివాళ్లు ఇంకా ఎంత మంది ఉంటారో నాకు తెలీదు కానీ, నేను మాత్రం పూర్తిగా దురదృష్టవంతుడిని. ఇంకా చెప్పాలంటే నేను ఒక నష్టజాతకుడిని.''

కుర్రాడి మాటలకి నేను హఠాత్తుగా ఉలికిపడ్డాను. ఈ అబ్బాయి మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. మంచికీ, చెడుకూ విచక్షణ తెలిసినవాడు. అతను మాట్లాడిన తీరు అర్థం చేసుకున్న మనసు తాలూకు స్పందన. స్పందించిన మనసుకి కుదురుండదు. కర్తవ్యాన్ని ప్రోత్సహిస్తుంది.




''అవును, ఇవ్వాళ నీ డ్యూటీ ఎన్ని గంటల వరకు?'' టైము చూసుకుంటూ అడిగాను.

''సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే! మరెవరైనా డ్యూటీకి రాక ఎగ్గొడితే, అర్ధ రాత్రి వరకూ పని చెయ్యక తప్పదు! '' జరుగుతున్న విషయం చెప్పాడు.

''అలా జరగదు! మీ ఓనర్‌తో నేను మాట్లాడతాను. నీ డ్యూటీ పూర్తవ్వగానే పంపించమని.'' అతని విషయంలో జోక్యం చేసుకోవాలన్న నిర్ణయం నాకు తెలియకుండానే స్థిరపడుతోంది.

''సార్, మీరెవరో నాకు తెలియదు. మీకు నా పేరు కూడా తెలియదు. నా గురించి మీరెందుకు ఆలోచిస్తున్నారు? మా ఓనర్‌తో మీరు ఏం మాట్లాడతారు? నేను ఎవరినని చెపుతారు?''

ఆ కుర్రాడు అలా మాట్లాడటం నన్ను అనుకోని ఇరకాటంలో పడేసింది. కాని ఈ కుర్రాడు తెలివైనవాడు, ఆలోచించి మరీ మాట్లాడాలి అనుకుంటూ, ''అదంతా నేను చూసుకుంటానులే! ఇంతకీ నీ పేరేమిటి?'' అని అడిగాను.

అతను కొంచెం సేపు అయ్యాక ''సూర్యం సార్'' అని చెప్పాడు. అతని పేరు వినగానే మనసు చివుక్కుమంది. కారణం నాకు తెలియదు. అతను మరో గంట పని చెయ్యాలి. అందుకని, ''నేను నా పనులు పూర్తి చేసుకుని మళ్లీ వస్తాను. నువ్విక్కడే ఉండు'' అంటూ అక్కడి నుంచి కదిలాను.

అలాగేనని తలూపాడు. అతనితో మాట్లాడాలని నేను నిర్ధారించుకున్నాను. అంతవరకూ బాగానే ఉంది. కాని నేను తిరిగి వెళ్లేంతవరకూ ఆ కుర్రాడు ఉంటాడా? నేనెవరో, తనెవరోనని వెళ్లిపోతే? అనుకోకుండా నాలో అనుమానం. ఒకవేళ అదే గనుక జరిగితే, నా పరిస్థితి ఏమిటి? ఆలోచన, అనుమానం ఒకదానితో పాటు మరొకటి!

నా పనులు పూర్తి చేసుకుని తిరిగి అక్కడికి చేరుకున్నాను. సూర్యం, పెట్రోలు బంకు నించి బయటకొచ్చి, నా కోసం ఎదురు చూస్తున్నాడు.

నన్ను చూసి అతను దగ్గరికొచ్చాడు. ఎంతో ఉత్సాహంగా నా దగ్గరికొచ్చాడు. ఎప్పుడు ఎవరిని కలుస్తామో తెలియదు. కలిశాక ఎందుకో వాళ్ల పట్ల అనుబంధం ఏర్పడుతుంది. అనుబంధం బాధ్యతని ప్రేరేపిస్తుంది.

మోటార్ బైక్ మీద, నా వెనుక కూర్చున్న సూర్యం గురించి నాలో స్ఫురించిన భావన! ఇలాంటి సందర్భం వస్తుందని ఊహ కూడా నాలో ఎప్పుడూ రాలేదు.

''సార్, మనం ఎక్కడికి వెడుతున్నాం?'' అడిగాడు సూర్యం.

''మనం ఏదైనా హోటల్లో కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం'' అంటూ చెపుతున్న నాతో, ''సార్, ఒక్కసారి బండి ఆపండి'' అనగానే, మరో మాట లేకుండా బండిని రోడ్డుకి పక్కగా ఆపాను. అతను వెంటనే దిగి నా ఎదురుగా నిలబడ్డాడు.

హఠాత్తుగా బండిని ఆపమన్నదెందుకు, ఇలా నిలబడటం ఎందుకో నాకు అర్థం కాలేదు. అదీ కాకుండా ఒక పక్క చిరాకుగా కూడా ఉంది.

''సార్, నేను కాఫీ తాగను సార్!''

అతని మాటకు ఒళ్లు మండి పోయింది. కాని బయటపడకుండా నిగ్రహించుకున్నాను. ''మరేం మొహమాటపడకు, వెడదాం పద.'' బయలుదేరబోయాను.

(సశేషం)